క్లుప్తంగా

నిందితులపై చర్యలు తీసుకోవాలి

గండేపల్లి: విజయవాడలోని స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, దళిత నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం ఘటనకు నిరసనగా శుక్రవారం గండేపల్లిలో సర్పంచ్ రుత్తల లలిత, దళితులతో కలిసి నిరసన తెలిపారు. తొలుత గండేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షా అభియాన్‌లో భాగంగా సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి ఆధ్వర్యంలో గైనకాలజిస్టు డాక్టర్ సునీత గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు దాత బాపిరెడ్డి సహకారంతో భోజనాలు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్ అభిమానుల సేవా కార్యక్రమాలు



ప్రత్తిపాడులో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

ప్రత్తిపాడు: ప్రముఖ సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం అతని అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు సలాది కృష్ణ ఆధ్వర్యంలో దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు, స్థానిక ఎన్‌హెచ్‌పై గల పాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల శ్రీశారదా వయో వృద్ధ నిలయంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ సభ్యులు తాతపూడి అనిల్‌కుమార్, కొల్లా అనిల్ కుమార్, కాతేటి రమేష్, జెడ్డా వెంకటేష్, మోర్త వీరబాబు, గెద్దం నానీ, బత్తిన చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

ఏలేశ్వరం: విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని మర్రివీడు, పరిమితడక, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, రమణయ్యపేట, సి.రాయవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్కారీ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభ చూపి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వరలక్ష్మి, ప్రముఖ వైద్యుడు ఎస్.విజయబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రత్తిపాడు: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, హర్‌ఘర్ తిరంగా నియోజకవర్గ కన్వీనర్ చిత్రా పాపారావు, జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కించు జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌ను విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం ఏడీ పి.నాగేశ్వరరావులతో కూడిన బృందం పాఠశాలలో డిజిటల్ తరగతులు, ఉపాధ్యాయుల బోధన, పాఠశాల ప్రగతి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల నిర్వహణ, భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్‌బాజ్జీ, పాఠశాల హెచ్‌ఎం ఎ.లక్ష్మిమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

వరివడిగా సాగు

- ముమ్మరంగా ఖరీఫ్ పనులు
- వరినాట్లతో రైతాంగం బిజీ
- 22 వేల ఎకరాల్లో సాగు



ఏలేశ్వరంలో నాట్లు వేస్తున్న కూలీలు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఖరీఫ్ వరిసాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీజన్ ప్రారంభంలో ఓ మోస్తరుగా వర్షాలు ఉండగా ఖరీఫ్‌పై రైతులు దిగాలు చెందారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడటంలో దమ్ములతో పాటు నాట్లు ఊపందుకున్నాయి. అన్నదాతలు, వ్యవసాయ కూలీలు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో ఈ ఏడాది సుమారు 22 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో గత కొన్ని రోజులుగా వర్షాలు అశించిన స్థాయిలో పడటంతో నాట్లను వేగవంతం చేశారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో వర్షాలు అంతంతమాత్రంగా ఉండడంతో సాగు ఆలస్యమైంది. ముందుగా నాట్లు వేసిన చోట పంట ఏపుగా ఎదుగుతోంది. సమయానికి పంట దిగుబడికి వచ్చేలా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తదితర గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

రైతులకు సూచనలు

రైతులు పెట్టుబడి తగ్గించుకొనేందుకు వెదజల్లు విధానాన్ని పాటించాలని, డ్రమ్ముసీడర్ విని యోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీని ద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు పదిరోజుల ముందే పంట చేతికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. రైతులు ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు. అలాగే వరినారుకు తెగుళ్ల సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ఎస్సీలకు దక్కని పదవులు

- ఎస్సీ గురుకులంలో ఆ వర్గానికి దక్కని ఎస్‌ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు
- కోర్టును ఆశ్రయిస్తానన్న కమిటీ సభ్యుడు నూకరాజు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు దళితులకు దక్కలేదు. గురువారం నిర్వహించిన ఎన్నిక జాప్యమవ్వడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఎంసీ కమిటీలో సభ్యుడుగా ఎన్నికైన కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన నెమ్మాది నూకరాజు శుక్రవారం దీనిపై తుని ఎంఈఓ పరవాడ గీతాదేవికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతులను స్థానిక మీడియాకు అందించి, జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఆశ్రమ పాఠశాలలో మెజార్టీ విద్యార్థినులు 85 శాతానికి పైగా ఎస్సీలు, మిగిలిన విద్యార్థినులు ఎస్టీ, బీసీ తదితరులు ఉన్నారు. అత్యధిక సంఖ్యలో ఎస్సీ విద్యార్థినులు ఉన్నప్పటికీ యాజమాన్య కమిటీ ఛైర్మన్ పదవి బీసీ, వైస్ ఛైర్మన్ పదవి ఎస్టీ సొంతం చేసుకున్నారు. ప్రిన్సిపాల్ నిరంకుశంగా వ్యవహరించి బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు పొందేవిధంగా ఎన్నిక నిర్వహించారని కమిటీ సభ్యుడు నెమ్మాది నూకరాజు ఆరోపించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నారు. దీనిపై ఎంఈఓ గీతాదేవిని వివరణ కోరగా కమిటీ సభ్యుడు నూకరాజు నుంచి ఫిర్యాదు అందిందన్నట్టు తెలిపారు. ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విచారణ నిర్వహించి నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల కుమారిని సంప్రదించగా తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎంపిక చేశామన్నారు. అలా ఎంపిక చేసిన సభ్యుల నుంచి ఛైర్మన్ పురుషుడైతే, వైస్ ఛైర్మన్ మహిళ, ఛైర్మన్ మహిళయితే వైస్ ఛైర్మన్ పురుషుడు ప్రతిపాదికన సభ్యులు చేతులు ఎత్తి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకున్నట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి



గోకవరంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శి తదితరులు

గోకవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఎంపీడీఓ గోవిందు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గోకవరంలో పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్నబాబు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



పరిమితడకలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరిమితడక గ్రామంలో శుక్రవారం గిరిజనులు ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ అనుబంధ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం జరుపుతున్న ప్రభుత్వం గిరిజనుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గిరిజన గ్రామాల్లో సంపదను కార్పొరేట్ సంస్థలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా గిరిజనుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. కార్యక్రమలో నాగులాపల్లి అర్జునుడు, సాబే కొమ్మయ్య, సోమాల సంకురు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి



తాళ్లూరులో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

గండేపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు వచ్చే నెల 10వ తేదీ లోపుగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సద్గురుమూర్తి సూచించారు. మండలంలోని సూరంపాలెం, తాళ్లూరు, మల్లేపల్లి గ్రామాల్లో ఈ-పంట నమోదును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ విధిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేయిస్తేనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఖరీఫ్ వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఉద్యాన, సహాయకులు కనకయ్య, సాయికిరణ్ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోటనందూరు: మండలంలోని తిమ్మరాజుపేటలో ధర్మజ్యోతి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. నిర్వాహకులు విశ్వశాంతి జ్యోతిర్మయి ప్రభువుల గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ధర్మజ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో తుని అలయన్స్ క్లబ్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా శ్రీనివాస్



వైస్ చాన్సలర్ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్‌ను నియమించినట్టు యూనివర్సిటీ ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, డోలా సంజయ్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, సిబ్బంది శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా మాధవరావు

రౌతులపూడి: మండల తహసీల్దార్‌గా కేవీ మాధవరావు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నట్లు సమాచారం. ఇక్కడ పనిచేసిన తహసీల్దారు విద్యాపతి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయినట్టు డిప్యూటీ తహసీల్దారు పీవీవీ సత్యనారాయణ తెలిపారు.

గోకవరం తహసీల్దార్‌గా సరస్వతి

గోకవరం: స్థానిక తహసీల్దార్‌గా సరస్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నందిగామ మండలంలో తహసీల్దార్‌గా పని చేసిన ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ రజని ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- విశేష అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- కిటకిటలాడిన ఆలయాలు



గోకవరం దేవీచౌక్ ఆలయంలో వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయం శ్రావణశోభను సంతరించుకుంది. శ్రావణమాసంలోని మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మను ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మలు వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి వరలక్ష్మీదేవి అలంకారంలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

గాజుల అలంకరణలో వరమహాలక్ష్మి అమ్మవారు



తునిలో గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న వరమహాలక్ష్మి

తుని: స్థానిక చిట్లూరి మెట్రోలో వేంచేసిన వైకుంఠ నారాయణ సమేత వరమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా వేద పండితులు అమ్మవారిని వివిధ రకాల గాజులతో అలంకరించి కుంకుమ పూజలు, సౌందర్యలహరి పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

తుని రూరల్: శ్రావణమాసంలో తొలి శుక్రవారం కావడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నవ కలశాల పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. నవకలశ స్నపనం, గరుడ ప్రసాద వితరణ చేశారు. పసుపు, కుంకుమ, వివిధ రకాల గాజులతో అమ్మవారికి సౌభాగ్యలక్ష్మీ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గోపూజ, స్వర్ణ పుష్పార్చన, సహస్ర కుంకుమార్చన, సహస్ర దీపాలంకార సేవలు చేశారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించారు.

వైభవంగా నాగపంచమి దేవతారాధన



తపోవనం ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శుక్రవారం నాగదేవత ఆరాధన నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, నవగ్రహ పూజలు, హోమం, పూర్ణాహుతి, రావి చెట్టు చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. శృంగేరీ జగద్గురువు జన్మదినం సందర్భంగా గురువందనం సభ నిర్వహించారు. శ్రీకృష్ణ యజుర్వేద విద్యారణ్య వేద భాష్య వ్యాఖ్యానము సభ విశేషంగా నిర్వహించారు. వేద పండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



తునిలో డెంగీపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రత్తిపాడు: శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్య సాధ్యమని, ప్రస్తుత వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గీత సూచించారు. మండలంలోని ఏలూరు గ్రామంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆమె గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి దోమల వలన కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. మురుగునీటి కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆనంద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తుని: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక 17వ వార్డులో డెంగీ నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. రుబ్బురోళ్లు, ఖాళీ కొబ్బరి బోండాలు, టైర్లు, గుంతల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడి ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని సూచించారు. అనంతరం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గిరిజన సంప్రదాయ వేషధారణల్లో విద్యార్థినులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఉదయ కుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులు గిరిజన సంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. అల్లూరి సీతారామరాజు, కొమరంభీం ఏకపాత్రాభినయం, వివిధ వేషధారణలు, నృత్యాలు ప్రదర్శించారు. విద్యార్థినుల్లో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆలవాట్లు పెంపొందించడమే లక్ష్యంగా ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించినట్టు హెచ్‌ఎం ఉదయ కుమారి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు సాగించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు జక్కంపూడి రాజు, నాగులపల్లి అచ్చారావు, కోరుకొండ మరియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



పి.మల్లాపురంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న గిరిజనులు

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజనులు తొలుత అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని సబ్ ప్లాన్ గిరిజన గ్రామాలను ఐటీడీఏ కలపాలని, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు కించి అప్పలకొండ, భూసరి బాలరాజు, జర్తా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్, తదితరులు హోమం నిర్వహించారు. అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్షకుంకుమార్చనలు నిర్వహించారు.

గండేపల్లి ఎస్సైగా శివనాగబాబు



గండేపల్లి: స్థానిక ఎస్సైగా యూవి శివనాగబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో బొమ్మూరు, సీతానగరం, రాజానగరం, గోకవరం పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై గండేపల్లి వచ్చినట్టు సిబ్బంది తెలిపారు. స్టేషన్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



గోకవరంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందిస్తున్న దాతలు

గోకవరం: గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం దాతలు కుర్చీలను వితరణ చేశారు. గ్రామానికి చెందిన దొమ్మేటి లోక్షిత్‌సాయి పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు పది కుర్చీలను అంగన్‌వాడీ కేంద్రానికి బహూకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ఇందిరారాణికి వీటిని అందించారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గాభవానీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

గండేపల్లి: కేరళలోని వరద బాధితుల సహాయార్థం గండేపల్లిలో శుక్రవారం విరాళాలు సేకరించారు. వయనాడ్‌లో ప్రకృతి బీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని స్వచ్ఛంద సేవకులు ఎస్.లలిత, కె.శాంతి, జి. దివ్య కోరారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. సేకరించిన ఆర్థిక సాయాన్ని సీఐటీయూ ద్వారా ఆ రాష్ట్రానికి అందజేయనున్నట్టు తెలిపారు.

12 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ప్రత్తిపాడు: పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు. పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ఈ నెల 12 నుంచి 14 వరకు శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. గ్రామ సర్పంచులు, గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకూ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలని కోరారు.

అమ్మవారికి సారె సమర్పణ

బోట్‌క్లబ్: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వారికి బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. 108 రకాల స్వీట్లు, పండ్లు, పువ్వులతో సారెను అమ్మవారికి సమర్పించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.